# గురుకులం

## (ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయముల సంస్థ (రి), హైదరాబాదు)

సర్క్యులర్ నెం. పి1/3929/2010, తేదీ.31 .01.2011

## సర్క్యులర్

విషయము ః- గురుకులం, హైదరాబాదు -- గిరిజన గురుకుల విద్యాలయములలో సిబ్బంది హాజరు బయో మెట్రిక్ విధానం ద్వారా అమలు చేయుటలో తగు సూచనలు మరియు ఆదేశములు.

ప్రస్తుత కాలంలో ప్రపంచ వ్యాప్తంగా అన్ని సంస్థలు అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అన్ని రంగాలలో ఎంతో అభివృద్ధిని సాధించడం మనం చూస్తున్నాం. అదే విధంగా మన గురుకుల విద్యాలయాల సంస్థలో కూడా మనకు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వనరులను వినియోగించుకుని మన గురుకుల విద్యాలయాల సంస్థ అభివృద్ధిపథంలో సాగే విధంగా వివిధ ప్రయత్నాలు చేపట్టడం జరుగుతున్నది.

ఇందులో భాగంగా గురుకులానికి ప్రత్యేకమైన వెబ్‌సైట్, ఎస్.ఎం.ఎస్ ద్వారా విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులు ఎప్పటికప్పుడు తెలుసుకోవడం (హిమ్స్), అన్ని గురుకులాలలో ఆర్థిక పరమైన అంశాలను అన్‌లైన్ పద్ధతి ద్వారా అమలు చేయడం (ఎఫ్.ఏ.ఎస్), అన్‌లైన్ ద్వారా పాఠ్యాంశాల బోధన (వర్చ్యువల్ క్లాసెస్), మూడుల్స్ సాఫ్ట్‌వేర్ ద్వారా అన్ లైన్ ద్వారా విద్యార్థులకు పరీక్షలు మొదలైన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నది. వీటిలో భాగంగా మొదటి విడతగా ఎంపిక చేయబడిన (21) గురుకుల విద్యాలయాలలో సిబ్బంది హాజరును ప్రయోగాత్మకంగా బయోమెట్రిక్ విధానం ద్వారా తీసుకోవడానికి నిర్ణయం తీసుకోబడింది. దీనికి సంబంధించి ది.10.12.2010 నాడు శిక్షణా తరగతులు కూడా నిర్వహించడం జరిగింది.

ఇప్పటికే ఈ ఎంపిక చేయబడిన (21) గురుకుల విద్యాలయాలకు బయోమెట్రిక్ మిషన్స్ మరియు జి.పి.ఆర్.ఎస్. బేస్డ్ (సాటిలైట్ అనుసంధానంతో) బి.ఎస్.ఎన్.ఎల్. సిమ్ కార్డులు కూడా సరఫరా చేయడం జరిగింది. వీటితో పాటు సంబంధిత విద్యాలయాలల్లో పనిచేయుచున్న రెగ్యులర్, కాంట్రాక్టు మరియు అవుట్‌సోర్సింగు ఉద్యోగుల వివరాలు, వారికి ఐ.డి. నెంబర్లు మరియు బయోమెట్రిక్ మిషన్స్ ఉపయోగించే విధానంతో కూడిన వివరాలు ఈ మెయిల్ ద్వారా పంపడం జరిగింది.

ఈ బయోమెట్రిక్ మిషన్స్ వాడటంలో పాటించవలసిన సూచనలు ఈ దిగువ ఇవ్వడం జరుతున్నది. సంబంధిత ప్రిన్సిపాల్స్ / వైస్ ప్రిన్సిపాల్స్ వీటిని తప్పనిసరిగా పాటించవలసి ఉంటుంది.

1. బయోమెట్రిక్ మిషన్‌ను సంబంధిత ప్రిన్సిపాల్ గారి సంరక్షణలో మాత్రమే ఉంచవలెను. ఒకవేళ ప్రిన్సిపాల్ అందుబాటులో లేని సందర్భాలలో ఈ మిషన్స్ వైస్ ప్రిన్సిపాల్ సంరక్షణలో ఉండాలి.

2. బయోమెట్రిక్ మిషన్ నందు సాంకేతిక పరమైన లోపాలు ఏమైనా వచ్చినచో వెంటనే గురుకులం ప్రధాన కార్యాలయానికి సమాచారం పంపాలి. అంతేకాని స్వంతంగా మరమత్తులు చేయరాదు.

3. సరఫరా చేయబడిన బయోమెట్రిక్ మిషన్ విద్యుత్చ్ఛక్తితో, సోలార్ సిస్టంతో, బ్యాటరీ బ్యాకప్‌తో పనిచేస్తుంది. ఒకవేళ సిగ్నల్స్ లేనిసమయంలో దీనిలోని డాటాను పెన్‌డ్రైవ్ ద్వారా తీసుకుని సిగ్నల్స్ ఉన్న చోటు నుండి ఇంటర్‌నెట్ ద్వారా గురుకులం ప్రధాన కార్యాలయానికి ఈ మెయిల్ పంపవచ్చును.

4. కేవలం సాంకేతిక లోపాలు తప్ప మరే విధంగానైనా ఈ బయోమెట్రిక్ మిషన్ చెడిపోయినట్లయితే దానికి సంబంధిత ప్రిన్సిపాల్స్ / వైస్ ప్రిన్సిపాల్స్ బాధ్యత వహించవలసి ఉంటుంది.

5. బయోమెట్రిక్ మిషన్ నందు బిఎస్ఎన్ఎల్ వారి జిపిఆర్ఎస్ బేస్డ్ సిమ్ కార్డు అమర్చబడి ఉంది. ఈ సిమ్ కార్డును ఎట్టిపరిస్థితులోను అనుమతి లేకుండా తొలగించరాదు.

6. సిబ్బంది హాజరు ప్రతి పాఠశాల / కళాశాల నుండి గురుకులం ప్రధాన కార్యాలయంలో ఉన్న సర్వరులోకి రావడానికి గాను ప్రతి బయోమెట్రిక్ మిషన్‌కు ఒక స్టాటిక్ ఐపి ని ఇవ్వడం జరుగుతుంది. ఈ స్టాటిక్ ఐపి ని కూడా అనుమతి లేకుండా మార్చరాదు.

7. గురుకులం నుండి ఈ బిఎస్ఎన్ఎల్ వారి జిపిఆర్ఎస్ బేస్డ్ సిమ్ కొనుగోలు చేయడం జరిగింది. దీనికి సంబంధించిన నెలసరి బిల్లు సంబంధిత పాఠశాలలకు / కళాశాలలకు బిఎస్ఎన్ఎల్ నుండి రావడం జరుగుతుంది. ఈ సిమ్ కార్డు నెలసరి బిల్లు సుమారు రూ.125/- నుండి రూ.150/-కి మించకుండా వస్తుంది. ఈ బిల్లును సంబంధిత ప్రిన్సిపాల్ చెల్లించవలసి ఉంటుంది.

8. ప్రతి సిబ్బందికి ఒక కోడ్ నెంబరును కేటాయించి పంపడం జరిగింది. ఒకవేళ ఎవరి పేరైనా అందులో లేనిచో లేదా ఎవరైనా బదిలీపై వచ్చినచో మీ పాఠశాల / కళాశాలకు కేటాయించిన కోడ్ నెంబర్లలో ఆఖరు నెంబరు ఇచ్చి ఈ బయోమెట్రిక్ మిషన్ నందు రిజిష్టరు చేయాలి. ఈ సమాచారాన్ని వెంటనే గురుకులం ప్రధాన కార్యాలయానికి ఈ.మెయిల్ ద్వారా లేదా ఫ్యాక్సు ద్వారా పంపినచో వెంటనే చర్యలు తీసుకోబడుతుంది.

## సిబ్బంది హాజరును తీసుకునే విధానం :-

1. పాఠశాలల్లో ఉపాధ్యాయుల హజరును ఉదయం గం.7.00 ల నుండి 8.00 గం.ల లోపుగా తీసుకోవాలి. అదే విధంగా కళాశాలల్లో అధ్యాపకుల హాజరును ఉదయం గం.8.00 నుండి 9.00 గం.ల లోపుగా తీసుకోవాలి. అప్‌గ్రేడెడ్ కళాశాలల్లో కూడా ఉపాధ్యాయుల హాజరును ఉదయం గం.7.30 నుండి 8.30 లోపుగా తీసుకోవలెను.

2. తిరిగి మధ్యాహ్నం స్టడీ అవర్స్‌లో ఉన్న ఉపాధ్యాయులు స్టడీ అవర్స్ అయిన తరువాత అనగా సా.4.30 నిలకు అదే విధంగా రాత్రి స్టడీ అవర్సుల్ ఉన్న ఉపాధ్యాయులు రాత్రి స్టడీ అవర్సు పూర్తి అయిన తరువాత అనగా రాత్రి 9.00 గం.లకు ప్రిన్సిపాల్స్ / వైస్ ప్రిన్సిపాల్స్‌తో సహా బయోమెట్రిక్ ద్వారా హాజరు తీసుకోవలెను.

3. ఇక కార్యాలయ సిబ్బంది ఉదయం గం.10.00 నుండి 10.30 నిల మధ్య అదే విధంగా సాయింత్రం 5.00 గం.లకు ఈ బయోమెట్రిక్ ద్వారా హాజరు తీసుకోవలెను.

4. కిచెన్ నందు పనిచేయు మరియు క్లాస్-4 సిబ్బంది ఉదయం ఉపాధ్యాయులతో పాటుగా లేదా వారికి కేటాయించిన సమయాలలో హాజరును తీసుకోవలసి ఉంటుంది.

5. సంబంధిత ప్రిన్సిపాల్ / వైస్ ప్రిన్సిపాల్ ప్రతిరోజు సిబ్బంది యొక్క లీవులు / ఆన్ డ్యూటీ వివరములు సంబంధిత రికార్డులలో నమోదు చేసి వాటిని ఎస్.ఎం.ఎస్. ద్వారా లేదా ఈ మెయిల్ ద్వారా గురుకులం ప్రధాన కార్యాలయానికి పంపవలసి ఉంటుంది. అదే విధంగా సిబ్బంది మూమెంట్ రిజిష్టరును కూడా తప్పనిసరిగా నిర్వహించవలసి ఉంటుంది.

పైన పేర్కొనబడిన సూచనలు తప్పనిసరిగా పాటించవలసినదిగా సంబంధిత ప్రధానాచార్యులు / ఓఎస్‌డిలను ఆదేశించడమైనది.

కార్యదర్శి
గురుకులం

సంబంధిత గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాల్స్ / ఓఎస్.డి.లకు
సంబంధిత ఐటిడిఏ గిరిజన సంక్షేమ శాఖ ఉపకార్యదర్శులు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారులకు తగు సమాచారం నిమిత్తం మరియు పర్యవేక్షణ నిమిత్తం.
సంబంధిత ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులకు / అదనపు జాయింటు కలెక్టర్లకు తగు సమాచారం నిమిత్తం మరియు పర్యవేక్షణ నిమిత్తం.
ఫైలుకు